క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న పారిశ్రామికవేత్త చెన్నయ్య

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పారిశ్రామికవేత్త అంబటి చెన్నయ్య తన సొంత నిధులతో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, స్టేషనరీ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు లలితకుమార్, చైర్‌పర్సన్ రజిత, ప్రాధానోపాధ్యాయుడు ఎం.రాందాస్, నాయకులు రాజు, కుమార్, జంగయ్య, శ్రీను, రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, పుష్పలత, సుధ, రేణుక పాల్గొన్నారు.

జీవకోటికి ప్రాణాధారం మొక్కలు

హెచ్‌ఎం లక్ష్మీకుమారి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థులు

తుక్కుగూడ: మొక్కలు జీవకోటికి ప్రాణధారమని హెచ్‌ఎం లక్ష్మీకుమారి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధాయ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జైన్‌మందిర్, క్రాంతినగర్, హరిపురికాలనీ, సౌత్‌ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ దుర్గానగర్, వాంబేకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వేతనాలు అందక అవస్థలు

కందుకూరు: తమకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని 1962 అంబులెన్స్ ఉద్యోగులు డాక్టర్ పృథ్వీరాజ్‌రెడ్డి, సిబ్బంది సాయికిరణ్ ఆరోపించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున 1962 పేరుతో పశు సంచార అంబులెన్స్‌లు ఏర్పాటు చేసింది. కాగా అందులో విధులు నిర్వర్తించే తమకు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రత్యేకంగా నిధులు కేటాయించి మందుల కొరత లేకుండా చూడాలన్నారు. వారి వెంట సిబ్బంది నాగరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి ఆర్‌సీఐ రోడ్డులో చెరువు కట్ట కింద ఉన్న మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ వాణిని పుర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ మలుపు వద్ద బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోధ పాండు రంగారెడ్డి, నాయకులు మునగని రాజు, కోటగళ్ల రంజిత్‌కుమార్, బాల్‌రాజ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగ్యం

- మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు
- చిన్న వయసులోనే పెద్ద జబ్బులు
- ఆసనాలతోనే ఆరోగ్యం మన సొంతం
- రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న కాలనీవాసులు



ప్రాణాయామం చేస్తున్న యోగా గురువు ఇస్మాయిల్

హుడాకాంప్లెక్స్: మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లు.. శరీరానికి కనీస వ్యాయామం లేకుండా చేస్తున్నాయి. నిద్రలేమి, మానసిక ఒత్తిడి వెరసి సగటు మనిషి ఆరోగ్యం అనారోగ్యాల పుట్టగా మారుతోంది. చిన్న వయసులోనే పెద్ద జబ్బులు వెంటాడుతున్నాయి. చికిత్స పేరుతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నాం. మానసికంగా కృంగిపోతున్నాం. వీటన్నిటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే, అందుకు యోగాసనాలే యోగ్యమని వైద్యులు, యోగా నిపుణులు పేర్కొంటున్నారు. దీనితో ఎంతటి ఒత్తిడినైనా జయించవచ్చని స్పష్టం చేస్తున్నారు.

రోగాలను పెంచిపోషిస్తూ..

ఉరుకుల పరుగుల జీవితంలో సగటు మనిషి.. నాటి ఆహారపు అలవాట్లకు పూర్తిగా స్వస్తి పలికాడు. రెడీమెడ్ ఫుడ్‌తో సహజీవనం చేస్తున్నాడు. ఎక్కడ ఏం దొరికితే అది తింటూ కాలంతో పోటీపడుతున్నాడు. నోటికి రుచిగా అనిపిస్తే చాలు.. అది ఏదైనా ఆరగించి కడుపునిండా వ్యర్థాలను పోగేస్తున్నారు. తీరిక ఉన్నప్పటికీ.. వంట చేసి తినే ఓపిక లేక.. కావాల్సిన ఆహార పదార్థాలను ఆన్‌లైన్ ద్వారా కూర్చున్న వద్దకే తెప్పించుకుంటున్నారు. రోజంతా ఆఫీసు పని ఒత్తిడి, సాయంత్రం ఫ్రెండ్స్‌తో మాంసాహారం, మద్యంతో విందులు, ఎప్పుడో తెల్లవారు జామున నిద్రకు ఉపక్రమిస్తూ కాలం గడిపేస్తున్నారు. లేవడం ఆఫీసుకు వెళ్లడం, మళ్లీ పై విధంగానే గడపడం నేడు ప్రాంతంతో పని లేకుండా చాలా మందికి అలవాటుగా మారింది. కనీస వ్యాయామం లేకుండా ఒట్లో కొవ్వును పెంచుతూ.. రోగాలను పెంచిపోషిస్తూ.. ఆరోగ్యాన్ని కర్పూరంలా కరగదీస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

ఇలా కొవ్వును కరిగించుకోవచ్చు

మనిషి ఆరోగ్యం దెబ్బతినకుండా, కుటుంబం ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలన్నా.. పరిష్కార మార్గం ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే. అందుకు బహిరంగ ప్రదేశాల్లో నడవడం, జిమ్‌కు వెళ్లలేని వారు ఇంట్లో ఉండి యోగాసనాలతో శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరగదీయవచ్చునని వైద్య, వ్యాయాయ నిపుణులు పేర్కొంటున్నారు. యోగాలో ప్రాథమికంగా 84 రకాల ఆసనాలు ఉన్నాయని, వాటిలో కొన్ని నిలబడి చేసేవి కాగా, మరికొన్ని కూర్చొని, పడుకొని చేసే చేసేటివి ఉన్నాయి. శరీరంలోని ఒక్కో అవయవానికి ఒక్కో ఆసనం ఉంది. వాటిల్లో మీకు ఏది చేయాలని అనిపిస్తే అది చేయాలని, క్రమంగా యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని చెబుతున్నారు.

ముఖ్యమైన ఆసనాలు

- త్రికోణ, వీరభద్ర ఆసనం వంటివి నిలబడి చేసేవి.
- పద్మాసనం, వజ్రాసనం వంటివి కూర్చొని వేసేవి.
- భుజంగాసనం, శవాసనం పడుకుని చేసేవి.
- వృక్షాసనం, గరుడాసనం బ్యాలెన్సింగ్ ఆసనాలు.
- శీర్షాసనం, సర్వంగాసనం వంటివి రివర్స్ పద్ధతిలో చేసేవి.

ఆత్మీయులకు తీరని శోకం

శరీరానికి ఎలాంటి శ్రమను కలిగించకుండా సాగుతున్న జీవితాలు ఆకస్మికంగా ఆరిపోవడం నేడు అనేకంగా చూస్తున్నాం. మోజార్టీ ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ.. మధుమేహం, హైపర్‌టెన్షన్ బారిన పడుతున్నారు. అది గుండె, కాలేయం పనితీరుపై ప్రభావం చూపుతోంది. మరికొంత మంది ఉన్నచోటే.. గుండెపోటుతో కుప్పకూలి మృత్యుఒడికి చేరుతున్నారు. కుటుంబాలకు తీరని శోకం మిగుల్చుతున్నారు. ఇలా తెలితెలిసి నమ్ముకున్న వారిని రోడ్డున పడేయడం చాలా బాధకరమైన అంశం. కాస్త మేలుకుని.. ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతో పాటు.. ప్రతిరోజు ఉదయం కనీసం 45 నిముషాల పాటు నడక, వ్యాయామం, యోగా ఇలా ఏది చేయాలని అనిపిస్తే అది చేయాలని వైద్య, యోగా నిపుణులు సూచిస్తున్నారు.

రేపు వీఎంహోంలో యోగా ఉత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. ప్రాచీన సంప్రదాయమైన యోగాను స్మరించుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలి స్వీకరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు.

నొప్పులు మాయం



పదేళ్లుగా యోగా చేస్తున్నా. అంతకు ముందు నడవాలంటే ఇబ్బందిగా ఉండేది. చాలా మందులు వాడాను. ప్రయోజనం చేకూరలేదు. యోగా శిక్షణ తరగతులకు వెళ్లి, సాధన మొదలు పెట్టాను. క్రమంగా ఆరోగ్యం కుదుట పడింది. క్రమం తప్పకుండా ఆసనాలు వేస్తున్నాను. కుటుంబీకులకు నేర్పుతున్నాను.

– టేకుల మంజులారెడ్డి

మానసిక ప్రశాంతత

ఉరుకుల పరుగుల జీవితంలో అవిశ్రాంతిగా పనిచేయడం ద్వారా మనిషి రోగాల బారిన పడుతున్నారు. మానసికంగా కృంగిపోతున్నాడు. సమయానికి తిండి లేక, కంటి నిండ నిద్ర లేక, కనీస వ్యాయామం చేయక రోగాల పుట్టగా మారుతున్నారు. యోగాతో పైవాటికి చెక్ పెట్టి, ఉత్సాహంతో జీవితం గడపవచ్చు. పిల్లలకు ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలి. సాధన చేయించాలి. పాఠశాలల్లో రోజుకో గంట సమయం కేటాయించాలి.

– ఇస్మాయిల్, యోగా గురూజీ, సరూర్‌నగర్

వన మహోత్సవానికి సన్నద్ధం

- మలక్‌పేట సర్కిల్–6 అధికారుల కసరత్తు
- ప్రజా పంపిణీకి 30 వేల మొక్కలు
- ప్రభుత్వ స్థలాల్లో నాటేవి 2 వేలు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

చాదర్‌ఘాట్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మలక్‌పేట సర్కిల్–6 అధికారులు వన మహోత్సవానికి సన్నద్ధమవుతున్నారు. మలక్‌పేట సర్కిల్–6 పరిధిలోని ఆరు డివిజన్లలో 30 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందు కోసం పార్కులు, కాలనీలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ఆవరణ స్థలాలను ఎంపిక చేశారు. డివిజన్ల వారీగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల సహకారం తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

2 నర్సరీల్లో పెంపకం

మలక్‌పేట జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధిలో 2 డివిజన్లలో నర్సరీలు ఏర్పాటు చేశారు. కొన్ని రకాల మొక్కలకు ఇక్కడే అంట్లు గట్టి పెంచడంతో పాటు కొన్నిరకాల మొక్కలకు ఇతర నర్సరీల నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ సంరక్షిస్తున్నారు. ఇంటి ముందు ఆవరణలో ప్రజలు మొక్కలు నాటుకునేందుకు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇతర చోట్ల వేప, రావి, చింత, కానుగ, బాదం మొక్కలు నాటనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కార్యక్రమాల టైం టేబుల్ ఖరారు కాగానే మొక్కల పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక దృష్టి

సర్కిల్ పరిధిలో విశాలమైన మైదానాలు, పార్కులు లేవనే చెప్పాలి. దీంతో అధికారులు ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్కులు, శ్మశానవాటికలు, విశాలమైన రహదారులకిరువైపులా ప్రభుత్వ స్థలాల్లోనూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటనున్నారు.

పంపిణీ తీరు

సర్కిల్–6 పరిధిలో 6 డివిజన్లలో అన్నిరకాల మొక్కలు కలిపి 30 వేల మొక్కలు నాటనున్నారు. డివిజన్‌కు 5 వేల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇందులో 2 వేలు చిన్నతరహా 3 వేలు ఏపుగా పెరిగే మొక్కలు అందించనున్నారు. ఆరు డివిజన్లు కలిపి 30 వేల మొక్కలు నాటుతారు.

సంరక్షణకు చర్యలు



మొక్కలు పెరిగేందుకు అనువైన స్థలాలు, సరిపోయే గుంతలను ఏర్పాటు చేస్తున్నాం. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణకూ చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తాం. వన మహోత్సవాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి పెంచాలి.

– సర్కిల్–6 హార్టికల్చర్ అధికారి కిరణ్‌కుమార్

రైతులందరికీ ‘భరోసా’

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



కేఎల్లార్‌తో మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణనాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన రైతులకు రైతు భరోసా వస్తుందని ఎవరూ ఆందోళన చెందొద్దని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణనాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్యతో పాటు పలువురు మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన రైతులకు రైతు భరోసా నిధులు జమ చేయాలని కేఎల్లార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ రైతుకు రైతు భరోసా వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేవ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ అడ్మిషన్ల గడువు పెంపు

మహేశ్వరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ అడ్మిషన్ల గడువును ఈ నెల 25వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న మాజీ మేయర్

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత ముఖ్యులుగా విచ్చేసి విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిగురింత దయారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, కుమార్, రమేశ్‌గౌడ్, గిరి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మహేశ్వరం: మహేశ్వరం ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 9154298784 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి తగు సలహాలు, సూచనలు అందించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాగోలులో..

నాగోలు: బండ్లగూడ డిపోలో శుక్రవారం ‘డయల్ యువర్ డీఎం’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం వెంకటేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ బస్సుల నిర్వాహణ, ప్రయాణికుల ఇబ్బందులు ఇతర అంశాలపై ఫిర్యాదు చేయాలంటే ఫోన్ నంబర్ 9959224058 లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరుగ్యారంటీల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంట పరిసరాలు, షాహిన్‌నగర్ మర్కజ్, క్యూబాకాలనీలలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించిన బస్తీలలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఇంటి పన్ను, నల్లా, కరెంట్ బిల్లులు అన్ని చెల్లిస్తున్నా వారి ఇల్లు కూలుస్తామంటూ బెదిరింపు ధోరణితో సర్వేలు నిర్వహించడంతో స్థానిక మహిళలు నిద్రాహారాలు మానుకుంటున్నారన్నారు. సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు కనీసం స్థానిక ఎమ్మెల్యేనైనా తనకైనా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఖాళీ స్థలాలు కనిపిస్తే అధికారులే ముందస్తుగా అక్కడ వాలిపోతున్నారన్నారు. ఎవరూ కూడా అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆమె స్థానికులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్, బీఆర్‌ఎస్ సీనియర్ నూరెడ్డి కృష్ణారెడ్డి, షర్ఫుద్దీన్ హామెద్, అలీ మన్సూరీ, సయ్యద్ బదర్, మక్దూం పటేల్, పల్లపు శంకర్, యంజాల అర్జున్, అజీమ్ ఖాన్, ఫైసల్ ఖాన్, సలీం, ఆరీఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



క్యూబా కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



దిలావార్‌గూడలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని దిలావార్‌గూడ, దుబ్బచర్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దిలావార్‌గూడలో–7 దరఖాస్తులు, దుబ్బచర్లలో–27 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత, సీనియర్ అసిస్టెంట్ పావని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు స్వర్ణకుమారి, ప్రేమ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నమస్తే ప్రాజెక్ట్‌పై అవగాహన

మీర్‌పేట: వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నమస్తే ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని కమిషనర్ జ్ఞానేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, హెల్పర్స్, స్క్రాబ్ షాపు డీలర్స్, పారిశుద్ధ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, ఈ–శ్రామ్ కార్డుల జారీతో పాటు పీపీఈ కిట్స్, శానిటేషన్ యంత్రాల కొనుగోలు, సబ్సిడీ రుణాలపై కమిషనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, నమస్తే ప్రోగ్రాం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి.యోగేశ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్‌కాలనీలో గల నల్లపోచమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, జంగారెడ్డి, సంధ్య, కల్యాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



మహేశ్వరం: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరినొకరూ తినిపించుకున్నారు. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.



కందుకూరు: కందుకూరు చౌరస్తాలో..



తుక్కుగూడ: తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న పార్టీ కార్యకర్తలు



హుడాకాంప్లెక్స్: రక్తదాన శిబిరంలో పాల్గొన్న నాయకులు